క్లుప్తంగా

వైభవంగా బోడకొండమ్మ విగ్రహ ప్రతిష్ట



గిడుతూరులో బోడకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మాకవరపాలెం : బోడకొండమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. మండలంలోని గిడుతూరులో ఆదివారం నూతనంగా నిర్మించిన ఆలయంలో బోడకొండమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ముందుగా గ్రామంలో ఊరేగించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణ నడుమ ప్రతిష్ట జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చురుగ్గా సిమెంట్ రోడ్డు పనులు



వీధుల్లో డ్రైనేజీ సిమెంట్ రోడ్డు పనులు

నాతవరం : మండల కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ కాలనీలో సిమెంటు రోడ్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల పంచాయతీలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో రోడ్లతో పాటు డ్రైనేజీల పనులు చురుగ్గా చేస్తున్నారు. ఆయా పనులు సకాలంలో పూర్తయితే ఈ కాలనీలో రోడ్డు సమస్య, డ్రైనేజీల సమస్య తీరుతుంది. సిమెంట్ రోడ్డు పనులు పంచాయతీరాజ్‌శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. నాణ్యత కలిగిన మెటీరియల్ వాడాలని, ఎలాంటి అవకతవకలు లేకుండా పనులు చేయాలని అన్నారు.

కెనాల్‌లో నాచు, మొక్కలు తొలగింపు




కెనాల్‌లో మొక్కలు తొలగిస్తున్న లస్కర్‌లు

కె.కోటపాడు : ఉగ్గినవలస–కొరువాడ గ్రామాల మధ్య గల రైవాడ కెనాల్ మార్గంలో పేరుకుపోయిన మొక్కలు, నాచును తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం నుంచి లస్కర్‌లు నిర్వహిస్తున్నారు. రైవాడ నుంచి కెనాల్ మార్గం ద్వారా విశాఖపట్నంకు ప్రతిరోజు 50 క్యూసెక్కుల నీరు వెళుతుంది. ఈ కెనాల్ మార్గం అడుగుభాగంలో నాచు, మొక్కలు ఎక్కువగా పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహ వేగం మందగిస్తుంది. దీంతో జీవీఎంసీ అధికారులు కెనాల్ మార్గంలో లస్కర్‌లతో మొక్కలు, నాచు తొలగించే పనులను చేపడుతున్నారు. దీనివల్ల నీటి ప్రవాహ వేగం పెరుగుతుందని అధికారులు తెలిపారు.

గుడ్డ సంచులు పంపిణీ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా సీబీఐ మాజీ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ పిలుపు మేరకు ఈ సంచులను పంపిణీ చేసినట్లు జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడీ గ్రూప్ సభ్యులు నుదురుపాటి తాతాజీ తెలిపారు.

గుండుబాడు రిజర్వాయర్ పునరుద్ధరణకు కృషి



గుండుబాడు రిజర్వాయర్‌ను సందర్శించి రైతులతో చర్చిస్తున్న చోడవరం జనసేన ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు

రోలుగుంట : వెయ్యి ఎకరాలకు సాగునీరందించే గుండుబాడు రిజర్వాయర్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకుచ్చేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తానని జనసేన చోడవరం ఇంచార్జి పి.వి.ఎస్.ఎన్, రాజు అన్నారు. ఆదివారం ఆయన గుండుబాడు రిజర్వాయర్‌ను ఈ ప్రాంత రైతులతో కలసి పరిశీలించారు. పలు కారణాలతో నిరుపయోగంగా మారిన ఈ రిజర్వాయర్ సమస్యను ముందుగా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పి- 4 కార్యక్రమం ద్వారా ఏదైనా కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి కానీ వ్యక్తుల నుంచి గానీ నిధులు సేకరించి పునరుద్ధరించే ప్రయత్నం చేస్తానని అన్నారు. అలాగే వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు.



రైవాడ ప్రాథమికోన్నత పాఠశాల



ఎంపీపీ పాఠశాలగా స్థాయి తగ్గనున్న తిమిరాం ప్రాథమికోన్నత పాఠశాల



ప్రాథమిక పాఠశాలగా మారనున్న నాగయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాల

కూటమి పాలనలో

విద్యా అవస్థ

విద్యారంగంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో దేవరాపల్లి మండలంలో నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడనున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నెపంతో ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిని ప్రాథమిక పాఠశాలల స్థాయికి కుదించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- ప్రాథమిక పాఠశాలలుగా మారనున్న ఐదు యూపీ స్కూళ్లు
- ఆయా విద్యార్థులకు చదువులు మరింత దూరం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

దేవరాపల్లి : ప్రభుత్వ నిబంధనల ప్రకారం దేవరాపల్లి మండలంలోని రైవాడ, వాకపల్లి, తిమిరాం, ములకలాపల్లి, నాగయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాలు మూతపడే జాబితాలో ఉన్నాయి. దీంతో ఆయా ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలుగా మారనున్నాయి. కాగా అక్కడి పాఠశాలల విద్యార్థులు 6,7,8 తరగతుల కోసం సమీపంలోని హైస్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామాలకు హైస్కూళ్లు దూరంగా ఉండడంతో విద్యార్థులు నిత్యం వ్యయ ప్రయాసల నడుమ చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

వాకపల్లి విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల దూరంలో తెనుగుపూడి హైస్కూల్‌కు, ములకలాపల్లి విద్యార్థులు మూడు కి.మీ దూరంలో ఉన్న వేచలం హైస్కూల్‌కు, రైవాడ, నాగయ్యపేట, తిమిరాం గ్రామాలకు మూడు కి.మీ దూరంలో హైస్కూళ్లు ఉన్నాయి.

గ్రామీణ విద్యార్థులకు చేటు

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యా విధానంపై ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యావేత్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేటు కలిగించేలా, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ప్రయోజనం చేకూర్చేలా కూటమి ప్రభుత్వ విద్యా విధానం ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు మూసి వేయడంతో ఆయా పాఠశాలలో పని చేసే స్కూల్ అసిస్టెంట్ టీచర్లు పని లేకుండా మిగిలిపోయే అవకాశం ఉంది. వీరిని బదిలీల పేరిట దూరప్రాంతాలకు బదిలీలు చేసేందుకు సన్నద్ధం కావడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీపీ స్కూళ్లు సహా యూపీ స్కూళ్లను సైతం నాడు-నేడులో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం అంచెలంచెలుగా ప్రభుత్వ పాఠశాలల మూసివేయడం అత్యంత దారుణమంటూ మండిపడుతున్నారు.

గత ఏడాది నాలుగు ఎంపీపీ స్కూళ్ల మూసివేత

కూటమి ప్రభుత్వ పాలనలో గత ఏడాది నాలుగు ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నెపంతో దేవరాపల్లి మండలంలోని బేతపూడి, సీతంపేట, చేనులపాలెం, యండపల్లిపాలెం ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని విద్యార్థులు ప్రాథమిక విద్య కోసం పక్క పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలాఉండగా తాజాగా ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలను మూసి వేసేందుకు రంగం సిద్ధం చేయడంతో కూటమి ప్రభుత్వ తీరుపై విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూతబడే జాబితాలో ఐదు స్కూళ్లు



ప్రభుత్వ తీసుకున్న నూతన విద్యా విధానంలో మండలంలో రైవాడ, నాగయ్యపేట, వాకపల్లి, ములకలాపల్లి, తిమిరాం యూపీ స్కూళ్లు మూతపడే జాబితాలో ఉన్నాయి. తామరబ్బ యూపీ స్కూల్‌కు సుమారు పది కిలోమీటర్ల దూరంలో హైస్కూల్ లేక పోవడంతో దీనిని యథావిధిగా కొనసాగించాలని ప్రతిపాదించాం. అయితే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– బి.పడాల్‌దాస్, ఎంఈవో-1, దేవరాపల్లి

మోదకొండమ్మకు ఘనంగా సారె సమర్పణ



మాడుగులలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సారె ఊరేగిస్తున్న దృశ్యం

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా ఆదివారం సాయంకాలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సారె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కె.భాస్కర్, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా, మండల సభ్యులతో పాటు మాడుగుల పట్టణంలో ఉన్న వాసవీక్లబ్ వనిత, సభ్యులు పాల్గొన్నారు.

విరబూసిన తురాయి అందాలు



దాలివలస వెళ్లే మార్గంలో తురాయి పూల సోయగం

కె.కోటపాడు : రామచంద్రపురం నుంచి కె.సంతపాలెం వెళ్లే మార్గంలో తురాయి పూల చెట్లు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఈ మార్గంలో గల రోడ్డుకి ఇరువైపులా గల తురాయి చెట్లు ఏపుగా ఎదిగాయి. ఈ చెట్లకు ఎరుపు రంగులో తురాయిపూలు విరబూయడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులను, ప్రయాణికులను ఎంతో ఆకర్షిస్తున్నాయి.

మా భూములు తిరిగి ఇచ్చేంత వరకూ న్యాయ పోరాటం

జోగన్నపాలెంలో బాధిత రైతులు వెల్లడి



సమావేశంలో పాల్గొన్న కుభిరెడ్డి సన్నిబాబు, కిలపర్తి అప్పలనాయుడు, బండారు గంగా శ్రీనివాస్

కె.కోటపాడు : కింతాడ రెవెన్యూ పరిధిలో గల తమ సాగులో ఉన్న భూములు గ్రామానికి చెందిన వేరే వ్యక్తి పేరున ఏ విధంగా నమోదు అయ్యాయో రెవెన్యూ అధికారులు లోతైన విచారణ జరిపి తిరిగి తమ పేరున ఆ భూములను నమోదు చేయాలని జోగన్నపాలెం గ్రామానికి చెందిన కుభిరెడ్డి సన్నిబాబు, కిలపర్తి అప్పలనాయుడు, బండారు గంగా శ్రీనివాస్ తెలిపారు. జోగన్నపాలెంలో ఆదివారం వీరు విలేకరులతో మాట్లాడుతూ తాత ముత్తాతల కాలం నాటి నుండి తమ సాగులో ఉన్న భూములను గ్రామానికి చెందిన బి.నరసింహనాయుడుతో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేర్లపైనా రెవెన్యూ రికార్డుల్లో నమోదు అయి ఉందన్నారు. దీంతో తమ భూములను సదరు వ్యక్తి నుండి తిరిగి తమ పేరున నమోదు చేసేలా చర్యలను తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించినట్టు వీరు తెలిపారు. వీరికి ఈ సమస్యను పరిష్కరించాలని సదరు వ్యక్తులు ఆదేశాలను జారీ చేసిన పరిష్కరించడంలో తాత్సారం చేస్తున్నట్టు వీరు వాపోయారు. తమ భూములు తమ పేరున నమోదు అయినంత వరకూ పోరాటం చేస్తామని సన్నిబాబు, అప్పలనాయుడు, గంగా శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో కుభిరెడ్డి అర్జున, చింతి అచ్చెన్న, బండారు అప్పలనాయుడు పాల్గొన్నారు.

గౌరిగెడ్డ వంతెన.. రెండు గ్రామాలకు రక్షణ

- గత వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మాణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కింతలి వల్లాపురంలో గౌరిగెడ్డపై నిర్మాణం జరిగిన వంతెన

మాడుగుల : మండలంలో కింతలి, వల్లాపురం రెండు జంట గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు మధ్యలో గౌరిగెడ్డ ప్రవహిస్తున్నది. దీని కారణంగా ఈ రెండు గ్రామాలతో పాటు మరో నాలుగు గ్రామాలకు వర్షా కాలంలో రాకపోకలు అతికష్టంగా ఉండేది. దీంతో గత ప్రభుత్వం హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సుమారు రూ.40 లక్షలు నిధులు మంజూరు చేయించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయించారు. వంతెన కూడా అప్పటిలోనే పూర్తికావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శరబన్నపాలెం, కొత్తూరు, పనుకు గదబూరు గ్రామాల వారు రావికమతం, నర్సీపట్టణం రావడానికి ఈ వంతెనే ఆధారం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మామిడిపల్లిలో ఘనంగా వీరుడుమాంబ ఒడ్డు పండగ



మామిడిపల్లిలో వీరుడు మాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, గ్రామ పెద్దలు



వీరుడిమాంబ ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న గ్రామ పెద్దలు, భక్తజనం

- భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న భక్త జనం
- అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీటీసీ సత్యం తదితర్లు
- ప్రత్యేక ఆకర్షణగా మహిళల కోలాట ప్రదర్శన

దేవరాపల్లి: మండలంలోని మామిడిపల్లిలో వీరుడుమాంబ అమ్మవారి ఒడ్డు పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకుడు చల్లా మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఒడ్డు పండగలో గ్రామస్తులంతా పసుపు కుంకుమలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సూరినాయుడు, ఎంపీటీసీ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ సుధాకర్, పండగ నిర్వాహకుడు చల్లా మహేష్ అమ్మవారిని దర్శించుకొన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తలపై ఘటాలు పెట్టుకొని చేసిన మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఉపాధి పనులు కల్పించండి



గుర్రాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం: కొండ శిఖర గ్రామాల్లో నివాసం ఉంటున్న తమకు స్థానికంగా ఉపాధి పనులు కల్పించాలని గిరిజనులు ఆదివారం విన్నూతంగా నిరసన వ్యక్తం చేశారు. మండలంలో చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన నేరేడుబంద, జీలుగులోవ, సోంపురం బందలు గ్రామాల్లో 160 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారు. వీరు కొండపోడు, సామలు, పసుపు, జీడి, అల్లం పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మాకు ఉపాధి పని కార్డులు ఉన్నా ఉపాధి పనులు లేవని, ఉపాధి పనులు కావాలంటే పది కిలోమీటర్ల దూరం గల గ్రామాల్లోకి వెళ్లి ఉపాధి పనులు చేయాలని అధికారులు చెబుతున్నారని తెలిపారు. సరైన రహదారి లేదు.. పది కిలోమీటర్లు దూరం వెళ్లి రావాలంటే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. తమ గ్రామాల్లో ఫారెస్టు పట్టా భూ గ్రామాల్లో సరైన ఉపాధి లేక కూలి పనులు నిమిత్తం గ్రామాలు విడిచి వలసలు పోతున్నారని, దీనివల్ల పిల్లలకు చదువులు లేకుండా పోతున్నాయిని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా పసలమారమ్మ తల్లి పండగ




అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలు

రావికమతం : పసలమారమ్మ పండగను గుమ్మాలపాడు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.అమ్మవారిని భక్తులు తెల్లవారు జామునుంచి దర్శించుకొని పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో పాడి పంటలు బాగా పండాలని, పశువులకు ఎటువంటి అనారోగ్యం రాకుండా ఉండాలని తల్లి పండగ నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న పశువులను అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారి దీవెనలు ఇవ్వాలని కోరుకుంటారు. అమ్మవారికి సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీ బంటు శ్రీను, విజయలక్ష్మి, వైస్‌సర్పంచ్ కాళింగి సన్యాసినాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రైవాడ కాలువల మరమ్మతులకు రూ.26 లక్షలు మంజూరు

దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయంకు చెందిన చానల్స్ మరమ్మతు పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 26 లక్షలు నిధులు మంజూరు చేసింది. జలాశయం దిగువన గల ఆయకట్టు భూములకు నీరందించే కాలువలు మరమ్మతుల నిమిత్తం ఈ నిధులు మంజూరు చేశారు. త్వరలోనే మరమ్మతు పనులు చేపడతామని అధికారులు తెలిపారు.

కాలీఫ్లవర్ సాగు..ఆదాయం బాగు



ములగపూడిలో సాగు చేస్తున్న కాలిఫ్లవర్ తోట



తోటలో ఏపుగా పెరిగిన కాలిఫ్లవర్ పువ్వు

- తక్కువ పెట్టుబడితో అధిక అదాయం పొందుతున్న రైతులు
- ఒకప్పుడు ఏజెన్సీకే పరిమితమైన కాలిఫ్లవర్ సాగు
- నేడు మైదానంలో విస్తారంగా పంట

నాతవరం: ఒకప్పుడు ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు చేసే కాలిఫ్లవర్ పంట ఇప్పుడు మైదానం ప్రాంతాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే ప్రస్తుతం కాలిఫ్లవర్ సాగు ద్వారా రైతులు అధిక అదాయం పొందుతున్నారు. మండలంలో ములగపూడి, బెన్నవరం మాధవనగం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల సాయంతో సాగు చేస్తున్నారు. మండలానికి సరిహద్దు గ్రామాలైన నర్సీపట్నం మండలం శివారు ప్రాంతమైన మెట్టపాలెం, కసిరెడ్డిపాలెం, అప్పన్నపాలెం గ్రామాల్లో కాయగూరలతో పాటు కాలిఫ్లవర్ పంటలు సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా ఇక్కడ రైతులు కాలిఫ్లవర్ పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ బోర్ల ఏర్పాటు చేయడం, 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో కాలిఫ్లవర్ తోటలు సాగుకు అన్ని విధాలుగా బాగుంటుంది. ఒక ఎకరంలో వేసిన కాలిఫ్లవర్ పంట ద్వారా మార్కెట్లో రేట్లు గిరాకీని బట్టి ఏడాదికి లక్ష రూపాయలు వస్తుందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి కష్టపడే రైతులకు అయితే కేవలం రూ.20వేలు ఖర్చు అవుతుందని లేకుంటే అదనంగా మరో రూ. 10వేలు ఖర్చు అవుతుందన్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే పెట్టుబడి తక్కువ అధిక అదాయం వస్తుందంటున్నారు. దీంతో ఈ ఏడాది ఆయా గ్రామాల్లో పలువురు రైతులు కాలిఫ్లవర్ సాగుపై దృష్టి సారించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు సన్నాహాలు

కశింకోట: మండలంలో ఈ నెల 22న హనుమజ్జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహంతోపాటు ఆలయానికి అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో అందంగా రంగులు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్థానిక జాతీయ రహదారి వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. జయంతి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తమలపాకు, సిందూర అర్చనలు వగైరా కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పూసర్లవీధిలోని ఆంజనేయస్వామి, కుమ్మర వీధిలోని పంచముఖి అంజనేయస్వామి, సలాది వీధి, హౌసింగ్ కాలనీల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

25న ఏపీయూడబ్ల్యూజే శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు స్వామి

గొలుగొండ : యూనియన్ బలోపేతానికి కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు సిహెచ్.బి.ఎల్. స్వామి సూచించారు. నర్సీపట్నం కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సభ్యులు సూచించిన అంశాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ నెల 25న యూనియన్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. యూనియన్ సభ్యులు అందరూ హాజరై శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సకిరెడ్డి నానాజీ, బేరా చినబాబు అలియాస్ బాబ్జి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు విజయ్, జనపాల శ్రీనువాస్‌వర్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవతమ్మ ఉత్సవానికి ఏర్పాట్లు



గవరపేటలో దేవతమ్మ

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన దేవతమ్మ ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం సిద్దుల వేషం, పంచరంగులు, పంచ చక్రాకారంలో అందంగా ముగ్గు పెట్టడం, దాన్ని 'వేగి' ఇంటి పేరు కలిగిన కుటుంబీకులు సంప్రదాయంగా తొక్కడం, అనంతరం దేవతమ్మను శారదానదిలో నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం సంప్రదాయంగా భక్తులు తెచ్చిన చీరల అమ్మకం నిర్వహిస్తామన్నారు. విశాఖపట్నం, గాజువాక, కూర్మన్నపాలెం, అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వేగి కుటుంబీకులు వచ్చి ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారన్నారు. ఈ ఉత్సవంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మేకపోతును నిద్రించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జముకుల వారి వాయిద్యాలతో అమ్మవారి పాట గానం చేస్తూ పూజలు చేసి మేకపోతును నిద్రించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు.